


# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... "ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను" అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్లే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్లే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో ఉన్న పాస్ పోర్టుపై "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి, నీకు ఎదురే లేదు అని ఏదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచేక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

# తూర్పు - పడమర

ఇల్లంతా త తళలాడించేసాను. వంటిటి గట్లు ముద్దొచ్చేలా, జబ్బలు పులిసిపోయేలా రుద్దిరుద్ది మెరిపించేసాను. డైనింగ్ టేబుల్ మీద చుట్టాలు, ప్రత్యేకమైన మనుషులు వచ్చేప్పుడు వేసే చక్కటి పాలనురగ లాంటి లేసు టేబుల్ క్లాత్ వేసాను. ఇంట్లో సామాన్లపై దుమ్ము ధూళి లేకుండా దులిపి పడేసాను. పిల్లదాని బొమ్మలన్నీ ముదరచుట్టి 'ఒట్టోమన్' సరుగుల్లో దాచేసి వాటిని సోఫా వెనుక పాతిపెట్టేసాను. ఇల్లంతా రూమ్ స్ప్రే కొట్టి, బాల్కనీ డోర్ తెరిచి సోఫాలో కూలబడ్డాను. ఒక్కసారి ఇంటిని మొత్తం చూద్దును కదా, చింతపండుతో తోమి ఎండలో ఆరబెట్టిన ఇత్తడి పళ్లెంలాగా మెరిసిపోతోంది. నన్నడిగితే ఇల్లు శుభ్రంగా పెట్టుకోవడం అనే వ్యసనానికి మించినది ఇంకోటి ఉండదు అంటాను. ఇంతా అలంకారం ఎందుకంటే, ప్రతీక్ పెళ్లి చేసుకుని మొదటి సారి వాళ్లావిడని తీసుకుని వస్తున్నాడు ఈరోజు.

ప్రతీక్ మా వారి ఫ్రెండ్. శతకోటి వీసా కష్టాలూ అనుభవించి, వర్క్ పెర్మిట్ల కోసం మూడు ఎం.స్ డిగ్రీలు చేసి, ఎలాగో అలా హెచ్1 వీసా సంపాదించి మొత్తానికి ఒక ఇంటివాడయ్యాడు. అమెరికా వీసా ఉన్నవాడు ఒక ఇంటివాడు అవ్వడం విశేషం కాదు. కానీ ఇక్కడ విశేషం ఏంటంటే అమ్మాయి 'తెల్ల దొరసాని.' అసలు అమెరికన్ వీసా సంపాదించడం తప్ప వేరే ఆశా, శ్వాస లేనట్టు ఉండే మా ప్రతీక్, ఇంగ్లీషు కూడా అచ్చ తెలుగు యాసలో మాట్లాడే ప్రతీక్ గుట్టు చప్పుడు కాకుండా 'ఆల్ ఆఫ్ ఏ సడన్' గా పెళ్ళికి ఇన్విటేషన్ పంపినప్పుడు ఆశ్చర్యపోయాను. లవ్ ప్రపోసల్ వీడియోలు, మ్యారేజ్ ప్రపోసల్ ఫోటో షూట్లు, ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్లు, బీచ్ వెడ్డింగ్ ఫోటో షూట్లు చూసేసరికి దాదాపు షాక్ లో మూర్ఛ వచ్చినంత పనైంది. మా వాడు ఇంత రొమాంటిక్ అని ఏనాడూ ఊహించలేదు. చింతపండు పులిహోరకి, లజానియాకి పెళ్లి, భలే భలే అనుకున్నాం అంతా. ఖండాంతర వివాహాలు న్యూస్ లో చూడడం తప్పించి ఇలా తెలిసిన వారిది చూడడం ఇదే మొదలు. పెళ్ళికి వెళ్లాలని ఎంతో సంబర పడ్డాము కానీ పెళ్లి, పెళ్లికూతురు వాళ్ళ ఊరిలోనే జరగాలనడం, మన విడిది వసతి మనమే చూసుకోవాలి కాబట్టి ఫ్లైట్ ఖర్చులు, తిండి – బస ఖర్చులు చూసి దడుచుకుని ఆగిపోయాము. సింపుల్ గా విషెస్ తో పాటూ ఒక నూటపదహారు డాలర్లు పెళ్లికానుక కింద ఇచ్చేసి ఊరుకున్నాము.

మామూలుగానే మనకి కుతూహలం ఎక్కువ. పెళ్లంటే ఇహ ఎన్ని తెలుసుకోవాలి. అందులోనూ ఖండాతర వివాహం ఇదీ. అక్కడికీ 'మనలో మన మాట' అంటూ ఇప్పటికే మా కామన్ ఫ్రెండ్స్ అభిప్రాయం 'కమ్' అనుమానమూ ఏంటంటే 'గ్రీన్ కార్డు కోసం చేసుకున్న పెళ్లి కాదు కదా?' అని. ఇప్పటికే అక్కడక్కడా ఇలాంటి కొన్ని గ్రీన్ కార్డు కాంట్రాక్టు పెళ్లిళ్లు చూడడం, వినడం జరిగింది. పెళ్లి చేసుకోవడం తప్ప వేరే బంధాలు ఉండవనీ, కొన్నిసార్లు అవతలి వారు మన వారిని తక్కువ చేసి పనులన్నీ చేయించుకుంటారని, వారి చెప్పు చేతల్లో పెట్టుకుంటారనే వార్తలు కూడా గుసగుసలుగా ఉన్నాయి. కాబట్టి నాక్కూడా అటూ, ఇటూ కాని అభిప్రాయం ఉంది వీళ్ళిద్దరి గురించి. ప్రతీక్ కి ఫలానా అమెరికా అమ్మాయితో పెళ్లి అని చెప్పాడు తప్ప వేరే విశేషాలు ఏమీ చెప్పలేదు ఈయన. వివరాలు అడగడు, నన్ను అడగనివ్వడు. అదే ప్రతీక్ నా స్నేహితుడైతేనా ఈపాటికి మొత్తం ఈ పెళ్లి పుట్టు పూర్వోత్తరాలతో సహా రాబట్టే దాన్ని. ఈ కాలం మరీను. స్నేహాలలో కూడా ఎన్ని హద్దులూ, గీతలో.

నిజం చెప్పాలంటే కొత్త జంట వస్తుంది అనే ఆనందం కంటే వీళ్ళిద్దరూ ఒకరితో ఒకరు ఎలా ఉంటారు అనే కుతూహలమే ఎక్కువగా ఉంది నాకు. ఇదివరకు ఇండియా ఒక్కసారి కూడా వెళ్ళలేదుట అమ్మాయి. పెళ్ళికొడుకు అమ్మ, తమ్ముడు తప్పించి ఎవరూ రాలేదు పెళ్లికి. అందుకే తను వస్తోంది అనగానే మన దేశ సంకృతి – సాంప్రదాయాలూ, పరువు – ప్రతిష్ట నాపైనే ఆధారపడి ఉన్నాయి అన్న భావన నాకు. అందుకే ఇంటి అలంకరణలో కాస్త ఎక్కువ శ్రద్ధ పెట్టాను. అమ్మాయి పేరు 'ఆన్.' ఆ పిల్లని అడగాల్సిన ప్రశ్నలు అన్ని కూడా మనసులోనే సిద్ధం చేసేసుకున్నాను. నా పిల్లదానితో కూడా అసలు కంటే ఎక్కువ స్నేహంగా, మర్యాదగా ఉండాలి అని మనసులోనే చాలా సార్లు హెచ్చరించుకున్నాను. ఎంత విసిగించినా, అల్లరిచేసినా నవ్వుతూ ఉండాలి అని పదే పదే గుర్తు చేసుకున్నాను. అసలు ఆదర్శ భారతీయ కుటుంబం అంటే ఏమిటో ఈ పిల్లకి చూపించాలి అని నిర్ణయించేసుకున్నా. నా హడావిడి చూసి ఈయన ఒకటే కంగారు. మరీ పిచ్చి ప్రశ్నలు వేసి హడలుకొట్టేస్తానేమో, మొదటికే మోసం వస్తుందేమో అని.

ఇదుగో వచ్చేసారు!

"హాయ్ ప్రతీక్!" పర్లేదు పిల్లోడు కాస్త ఒళ్ళు చేసాడు, సంతోషంగా ఉన్నాడు. మనోడే కాబట్టి హగ్గులు, షేక్ హ్యాండ్లూ అవసరం లేదు.

"హెల్లో ఆన్! వెల్కమ్!" అని అమ్మాయికి ఒక హగ్ ఇచ్చాను. ఇంతెత్తు విగ్రహం. 'అమెరికన్ ఈగల్' ఒక రెక్కతో 'పాలపిట్ట'ని కౌగిలించుకున్నట్టు అనిపించింది. బాగుంది పిల్ల. ఎంత చక్కగా నవ్వుతారో, 'ఇన్ఫెక్షియస్' నవ్వులు అనుకున్నాను.

పిల్ల దానికి ముందే ఒక అరగంట ట్రైనింగ్ ఇచ్చాను, ఆన్ కి పరిచయం చెయ్యగానే చక్కగా 'నమస్తే ఆన్, వెల్కమ్' అనాలి అని. పరిచయం చెయ్యగానే తుర్రుమని పారిపోయింది, బుడుగు వారసత్వం నిలబెడుతూ.

మా కోసం తాజా పూలు, పాప కోసం బొమ్మలు తీసుకుని వచ్చింది. నేను టీ, బిస్కెట్స్ తెచ్చేలోపు పాపకి బొమ్మలు ఎలా ఆడాలో చెప్తూ మంచి ఫ్రెండ్ అయిపోయింది ఆన్. ఇద్దరికీ భాష కూడా సమస్య కాదు కదా.

నా బుడ్డిదాన్ని తెగ పొగిడేసింది. అచ్చ తెలుగులో అనువదిస్తే 'నా పిల్ల ఒక అద్భుతం అని, ఇటువంటి బిడ్డని పొందినందుకు నేను అదృష్టవంతురాలిని' అని చెప్పింది. కొన్ని మాటలు ఇంగ్లీషులోనే హాయిగా ఉంటాయి. తెలుగులోకి మారిస్తే మనమే నమ్మలేము బాబోయ్! ఆన్ మాటలకి బుడ్డిది ఇంకొంచం ఎక్కువ అణకువ ఒలకబోసింది. ఈ భజన మంత్రం ఏదో బాగానే ఉందే అనుకున్నా.

'టీ' ని ఇండియా వెళ్ళినప్పుడు శిల్పారామంలో కొన్న మట్టి టీ కప్స్ లో పోసి తీసుకుని వచ్చా, 'అద్భుతం' అని మురిసిపోయింది. కొన్ని ఫోటోలు తీసుకుంది 'ఇన్స్టా' స్టోరీ లో పెట్టుకోడానికి. వీళ్లు వీళ్ళ ఛాదస్తం. ప్రతీ దానికి ఎక్స్ఐట్ అయిపోతారు. టీ పుట్టు పూర్వోత్తరాల గురించి కాసేపు మాట్లాడుకున్నాం. నాకు తెలిసింది కొంత, ఊహించి కొంత కలిపి ఏదో చెప్పాను. శ్రద్ధగా వింటూ, ఊఁ కొడుతూ ఉంది మధ్య మధ్యలో 'అద్భుతాశ్చర్యాలు' ఒలికిస్తూ.

ఇలాగే వదిలేస్తే చైనా నుండి యూరోప్ మీదుగా అమెరికా వచ్చిన టీ యాత్రా విశేషాలతో సరిపోతుంది అని, టాపిక్ మార్చి వారి పెళ్లి ఎలా జరిగింది అని అడిగాను. అంతే, చక్కగా అరటిపండు ఒలచినట్టు, వారిద్దరూ డేటింగ్ సైట్ లో కలుసుకుని, పరిచయాలు పెంచుకుని, పెద్దలని ఒప్పించి ఎలా పెళ్లి చేసుకున్నది, వాళ్ళ అమ్మా నాన్నల పెళ్లి జరిగిన చర్చిలోనే తమ పెళ్లి జరిగిందనీ, ప్రతీక్ తన జీవితంలో జరిగిన ఒక 'అద్భుతమ'ని చెప్పుకొచ్చింది.

చక్కగా ఉన్నారు జంట అనుకున్నాను. బాగా కలిసిపోయింది ఆన్. ప్రతీక్ గురించి మాటలు వచ్చినప్పుడల్లా, వాళ్ళు ఒక రూమ్ లో ఉన్నప్పుడు జరిగిన తమాషా విషయాలు చెప్తున్నప్పుడల్లా చాలా ఉత్సాహంగా వింటోంది. ప్రతీక్ కి ఇష్టమని గులాబ్ జామున్ నేర్చుకున్నది, వాళ్లిద్దరూ కలిసి ఇంటికి కావలసిన సామాను ఎలా ఎంపిక చేసుకున్నారు వరకూ చెప్పుకొచ్చింది. వాళ్లిద్దరూ ప్రేమలో ఉన్నారని, ఆ బంధం వారికి ఎంతో అపురూపం అని వారి కళ్ళలో కాంతి చెప్పకనే చెప్తోంది. నాకూ సంతోషంగా, ముచ్చటగా ఉంది వాళ్ళిద్దరిని చూస్తుంటే. ఎన్నెన్ని అనుకుంటామో మనిషిని కలవకముందు. ఒక్కసారి కలిసాక మంచి మనసు ఉండి కల్మషం లేకుండా మాట్లాడే వారు అయితే రంగు, అందం, జాతి, మతం ఈ భేదాలు అంతా ఎంత మూర్ఖంగా అనిపిస్తాయో కదా!

మేమిద్దరం మాటల్లో పడేసరికి అబ్బాయిలిద్దరూ పాత ఫ్రెండ్స్ ని కలవాలని చెప్పి బయటికి వెళ్లారు.

కాసేపు ప్రేమ వివాహాలూ, పెద్దలు కుదిర్చిన వివాహాల మీద మాట్లాడుకున్నాము. చివరాఖరికి 'ఏ రాయైతేనేమి పళ్ళు రాలగొట్టుకోవడానికి ' అని తేల్చేసి, అన్ని పెళ్లిళ్లు ఒకలాగే ముగుస్తాయని నవ్వుకున్నాం. బాలీవుడ్ సినిమాలంటే చాలా ఇష్టం అని చెప్పింది. 'బాలీవుడ్ క్లాసికల్ డాన్స్' అంటే ప్రాణం అంది. 'బాలీవుడ్ డాన్స్' వేరు 'క్లాసికల్ డాన్స్' వేరు తల్లీ! 'బాలే డాన్స్' కి 'జుమ్బా' కి ఉన్నంత తేడా ఉంది అని, మన సంస్కృతి, శాస్త్రీయ నృత్యాలు, కళల గురించి కాసేపు క్లాస్ తీసుకున్నాను. యోగా, గురించి కర్మ సిద్ధాంతం గురించి అడిగింది. ఏదో నా వాట్స్ అప్ ఫార్వర్డ్ మెసేజిలు, యూట్యూబ్ ప్రవచనాల్లో విన్నవి కలిపి నా సొంత సిద్ధాంతాలు చెప్పాను. "నువ్వు ఒక అద్భుతం" అంది మళ్ళీ.

ఈ పిల్ల మరీ పొగిడేస్తుందబ్బా. ప్రతి చిన్న దానికి 'థాట్స్ అమేజింగ్ అనో, మార్వలెస్ అనో, ఫ్యాబులస్' అనో మెచ్చుకుంటూనే ఉంది. ఇన్ని అద్భుతాలు ఉన్నాయా నా జీవితంలో అనుకున్నాను. ప్రతి చర్యకి అయితే 'థాంక్ యూ ' లేదా ' ఐ అప్రీషియేట్ ఇట్' అంటుంది. అచ్చ తెలుగులో 'బాలా నిన్ను మెచ్చితిన్' అనా? కొన్నిసార్లు ఇంగ్లీషే సౌఖ్యం. అమ్మకి, అత్తయ్య వాళ్ళకి ఎప్పుడన్నా 'థాంక్స్' చెప్పానా నేను? అని ఆలోచించా కాసేపు. మరి అమ్మమ్మా, నాన్నమ్మో! ఏనాడైనా 'థాంక్స్' చెప్పానా? నాకిష్టమని మామిడికాయలను పువ్వులుగా కోసి ఉప్పు, కారం రాసి ట్రైన్ లో తినమని ఇచ్చేది సెలవులకి వచ్చి వెళ్ళేటప్పుడు. 'థాంక్స్ అమ్మమ్మా, ఐ అప్రీషియేట్ ఇట్' అని అనుంటే ఏమనేదో మరి.

ఇంటిని చూపించాను ఆన్ కి. అప్పుడప్పుడు కొన్ని కొన్నిగా సేకరించిన బొమ్మలు, అలంకరణ సామాను చూసి భలే ముచ్చటపడింది. ఇల్లు, అలంకరణ, వంట అంటే చాలా ఇష్టం అంట. "ఐ లైక్ టు మేక్ ఎ హౌస్ ఎ హోమ్!" అంది. ప్రతీక్ గురించి తన గురించిన విశేషాలు చెప్తూనే ఉంది. మొగుడు –పెళ్ళాలు, ఇల్లు – పిల్లలు, పనీ – పాట అంతా ఒకటే అనిపించింది తూరుపైనా పడమరైనా!

బాల్కనీ గార్డెన్ చూస్తూ, "ఇంటిని చాలా బాగా పెట్టుకున్నారే" అంది.

"థాంక్స్ " అన్నాను ఒక పూటంతా పడ్డ శ్రమకి గుర్తింపు వచ్చినందుకు.

"ప్రతీక్ వాళ్ళ మామ్ కూడా పర్టికులర్. సర్దుతూనే ఉంటారు. ఒక నెల ఉన్నారు కదా మాతో." అంది ఆన్.

"అవును. అదొక ఫోబియా అనుకో. జీవితంలో సగం సమయం శుభ్రత – పరిశుభ్రతకే కేటాయిస్తాం అనుకుంట" అన్నాను 'నా శుభ్రత ముందు నీ పరిశుభ్రత ఎంత ' అనిపించేలా చెణుకులు విసురుకునే అత్తలు, ఆడపడుచులూ, వదినలు, మరదళ్ళను గుర్తుకుతెచ్చుకుని.

"అవును. కానీ మా ఫ్రెండ్ ఇండియా ట్రిప్ వెళ్లి వచ్చింది. చుట్టుపక్కల పరిసరాలు ఎక్కడా నీట్ గా ఉండవని చెప్పింది. స్కైప్ లో ప్రతీక్ వాళ్ళ ఇల్లు, వాళ్ళ చుట్టాలని చూసాను. ఎవరీ హౌస్ సీమ్స్ టు బి నీట్ అండ్ టైడి. జస్ట్ తెలుసుకుందామని అడిగాను. ఏమనుకోకు! " అంది.

ఏమని చెప్పను. నిజమే ప్రతి ఒక్కరు పోటీలు పడి మరీ మా ఇల్లు శుభ్రంగా ఉంటుంది అంటే మా ఇల్లు శుభ్రం అని గొప్పలు పోతాము కదా. చుట్టూ ఉన్న పరిసరాలు, వారి వీధి వరకు అయినా శుభ్రంగా ఉన్నాయా అని ఆలోచించామా ఎప్పుడైనా. ఇల్లు అయితే 'నాది' అనుకోబట్టే కదా. మరి దేశమో? ఏమి చెప్పాలో తేలిక దానికి కారణం అధిక జనాభా మీద, పరిమితమైన చోటు మీద వేసి చెప్పేసాను.

అరె ఒకరు కాదు ఇద్దరు కాదు, కలిసి ఒక అరగంట మాట్లాడితే చాలు ప్రతి వాళ్ళు ఇదే అడుగుతారు... "ఇండియా!! కలర్ఫుల్! బ్యూటిఫుల్! బాలీవుడ్! బట్ టూ మచ్ గార్బేజ్, ట్రాఫిక్, పొల్యూషన్!" అని. ఒక కిలోమీటర్ కి అమెరికాలో సగటున 30 మంది ఉంటె ఇండియాలో 415 ఉన్నారట. ఇవికాక కర్ణుడి చావుకు ఎన్ని కారణలో అన్ని కారణాలు మరి!

"మీరు ఏమి చేస్తుంటారు?" అని అడిగింది ఆన్.

ప్రపంచ భాషల్లో నాకు నచ్చని ఒకే ఒక ప్రశ్న. అడిగేసింది ఈ పిల్ల. సమాధానం చెప్పాలంటే నన్ను నేను కంట్రోల్ చేసుకోలేను. అక్కడికీ ఓపిక తెచ్చుకుని నా డిపెండెంట్ వీసా కష్టాలు మళ్లీ ఏకరువు పెట్టాను. నేను చెయ్యాలనుకున్నా చేయలేనని, ఇది అన్యాయమనీ నా పరిస్థితిని గ్లోరిఫై చేసాను.

కాసేపు 'ఓ నో ' లాంటి పదాలతో ఓదార్చింది ఆన్. నేను కూడా 'ఐ నో' అని తన 'కన్సర్న్' ని 'అప్రీషియేట్' చేశాను.

కాసేపాగి "కమ్యూనిటీ సర్వీసెస్ చెయ్యొచ్చు కదా! చాలా మంచి మంచి వ్యక్తులని కలుసుకోవచ్చు. మంచి మంచి విషయాలు తెలుస్తాయి. పైగా ఈ కమ్యూనిటీకి తిరిగి కాస్త సహాయం చేసిన తృప్తి కూడా ఉంటుంది" అంది.

"నిజమే చేయొచ్చు. కానీ డాలర్ విదల్చని ఏ పనీ పనే కాదని మన వాళ్ళు నూరిపోసారు కదా!" అని అంటే ఈ పిల్ల ఏమనుకుంటుందో మరి. ఒకసారి బుద్దిదాని ప్లే స్కూల్లో క్రిస్టమస్ వేడుకలకి వాలెంటీరింగ్ వెళ్తే 'ఎందుకా కంచి గరుడ సేవలూ?', 'రెండు పీ. జీ లు చేసి ఇదా నువ్వు చేసే ఘనకార్యం!', 'మూడో వీధిలో ఉండే పావనికి కూడా అక్కడ ఉద్యోగం వచ్చేసిందిట!' అని తల వాచిపోయేలా తలంటారు కదా అంతాను. అయినా కట్టుకున్న వాళ్ళ కోసం, పిల్లల కోసం, వారి పిల్లల కోసం సంపాదనలు సేవలు కానీ, ఈ కమ్యూనిటీకి సేవ చెయ్యడం ఏవిటి? అవన్నీ స్క్రీన్ లో మహేష్ బాబు, 'మన ఊరికి తిరిగి ఇచ్చెయ్యాలి, లేకపోతే లావైపోతాం' అని డైలాగ్ చెప్తే విజిల్స్ వేస్తాం. అంతవరకే కదా. ఛి ఛీ! ఇంత దారుణంగా ఆలోచిస్తానా నేను అనిపించింది. నిజమే ఎవడు ఆపాడు నన్ను పనికివచ్చే పనులు చెయ్యకూడదు అని. నా మీద నేనే జాలిపడే దరిద్రం వదులుకోవాలి ముందు. ఇష్టపడి ఇక్కడి నియమాలు తెలిసే కదా వచ్చాము. ఇకమీదటైనా మారాలి. ఎన్ని రోజులు ఇలా ఎవరికో సమాధానం చెప్పుకోవాలి అని బతకడం. నచ్చిన పనులు చెయ్యాలి. చెయ్యగలిగే స్వతంత్రం బోల్డు ఉంది కదా ఇక్కడ.

ఈ పిల్ల నన్ను నాకే ఒక వింత మనిషిగా చూపిస్తోంది అనుకుంటూ ఉండగా ప్రతీక్, తనూ వచ్చేసారు. బ్రతికిపోయాను అనుకున్నా. తరువాత డిన్నర్ చేస్తూ మళ్ళీ ఇండియా గురించి తన బాలీవుడ్ కలర్ఫుల్ అభిప్రాయాలూ, అద్భుతాలు కొన్ని చెప్పింది ఆన్. వడ్డించిన ప్రతి వంటకం గురించి అడిగి తెలుసుకుంటూ తనూ, మళ్ళి కొన్ని 'అద్భుతాలు' వింటూ మేము ఆనందంగా డిన్నర్ ముగించాము.

శ్రావణ మాసంలో, అదీ వీకెండ్, శుక్రవారం, కొత్త పెళ్లికూతురు వచ్చింది అని వెళ్లే ముందు కూర్చోపెట్టి పూలు, పండ్లతో తాబూలం ఇచ్చాను ఆన్ కి. అద్దాల తాపడం చేసిన నగిషీల జెవెల్లరీ బాక్స్ ఇస్తే బోలెడు సంబర పడిపోయింది. ఎందుకు ఇదంతా అని అడిగితే, "నీ జీవితం కూడా ఇలానే నిండుగా ఉండాలి అని తాబూలం ఇచ్చాను. కొత్తపెళ్ళికూతురివి కదా! అదే ఇండియాలో అయితే ఒక సంవత్సరం వరకు ఎవరి దగ్గరికి వెళ్లినా ఇలానే అపురూపంగా చూస్తారు" అని చెప్పి, మనస్ఫూర్తిగా తాంబూలం ఇచ్చాను.

నన్ను గట్టిగా కౌగలించుకుని, 'నన్ను ఒక రాకుమారిలా ట్రీట్ చేసావు. చాలా చాలా థాంక్స్' అని ఇంకా ఏం చెప్పాలో తేలిక మరొక్కసారి హగ్ చేసుకుంది. ఆనందంగా ఒక చోట చేరి ఇచ్చి పుచ్చుకునే తాంబూలాల్లో బోలెడు పాజిటివ్ ఎనర్జీ ఉంటుందని అంటారు. నిజమేనేమో మరి. ప్రతీక్, ఆన్ ఇద్దరు సంతోషంగా సెలవు తీసుకున్నారు. వాళ్ళు అవసరం కోసం చేసుకున్నారో, ఒకరి భావాలు ఒకరికి నచ్చి చేసుకున్నారో జడ్జ్

చెయ్యడం ఎందుకు, అనవసరం అనిపించింది. ప్రస్తుతం ఒకరిపై ఒకరికి నమ్మకం, స్నేహం ఉన్న జంటగా రాబోయే 'గ్లోబలైజ్డ్' తరానికి ఆద్యులుగా ఉన్నారు అనుకున్నాను.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments